వర్షంతో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా మ్యాచ్ రద్దు

రేసు రసవత్తరం

నాలుగు జట్లకూ నాకౌట్ అవకాశం! • నేడు ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్ కీలక మ్యాచ్

రావల్పిండి: చాంపియన్స్ ట్రోఫీలో ఆస్ట్రేలియాకు, వర్షానికి అవినాభావ సంబంధం ఉన్నట్టుంది. 2009వ ఎడిషన్ నుంచి ఆ జట్టు ఈ టోర్నీలో ఆడిన 8 మ్యాచ్‌లలో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అవడం ఇది నాలుగోసారి. రావల్పిండి వేదికగా దక్షిణాఫ్రికాతో జరగాల్సిన మ్యాచ్ వాన వల్ల టాస్ కూడా పడకుండానే రద్దైంది. దీంతో ఇరు జట్లు తలా ఒక పాయింట్ పంచుకున్నాయి. ఆసీస్, సఫారీ మ్యాచ్ రద్దవడంతో గ్రూప్-బీ లో సెమీస్ పోరు రసవత్తరంగా మారింది. ఈ గ్రూప్‌లో ఉన్న నాలుగు జట్లకూ సెమీస్ అవకాశాలు ఉన్నాయి. అవి ఎలాగంటే..

2 బెర్తులు.. 4 జట్లు

గ్రూప్-బీ లో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తలా ఒక మ్యాచ్ గెలిచి మరో మ్యాచ్ రద్దవడంతో చెరో 3 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉన్నాయి. తమ తొలి మ్యాచ్‌లలో ఓడిన ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్ ఇంకా ఖాతా తెరవలేదు. ఆస్ట్రేలియా, సఫారీలు తమ తర్వాతి మ్యాచ్‌లలో గెలిస్తే మిగిలిన సమీకరణాలతో సంబంధం లేకుండా ఆ జట్లు సెమీస్‌కు అర్హత సాధిస్తాయి. కానీ ఇంగ్లండ్, అఫ్గానిస్థాన్‌లతో జరిగే తమ చివరి మ్యాచ్‌లలో ఓడితే అప్పుడు ఆ జట్లకు తిప్పలు తప్పవు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంగ్లండ్, అఫ్గాన్ పోరు.. సెమీస్ రేసులో అన్ని జట్లకూ కీలకం కానుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు.. టాప్-2 టీమ్స్‌తో సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకుంటుంది. ఓడిన జట్టు తట్టాబుట్టా సర్దుకోవడమే.

నేటి మ్యాచ్ కూడా రద్దైతే..!

ఒకవేళ వర్షం కారణంగా బుధవారం ఇంగ్లండ్, అఫ్గాన్ మ్యాచ్ కూడా రద్దు అయితే అప్పుడు సెమీస్ రేసు మరింత రసవత్తరమవుతుంది. ఇంగ్లండ్.. తమ చివరి మ్యాచ్‌లో సఫారీలను ఓడించి.. అఫ్గాన్లు కంగారూలను మట్టికరిపిస్తే అప్పుడు నాలుగు జట్లకూ తలా 3 పాయింట్లు చేరతాయి. అప్పుడు నెట్ రన్ రేట్ కీలకమవుతుంది. ప్రస్తుతం సౌతాఫ్రికా.. +2.140 నెట్ రన్‌రేట్‌తో అగ్రస్థానంలో ఉండగా ఆస్ట్రేలియా +0.475తో రెండో స్థానంలో ఉంది. ఇంగ్లండ్ -0.475తో థర్డ్ ప్లేస్‌లో అఫ్గాన్.. -2.140తో నాలుగో స్థానంలో ఉంది. గ్రూప్-ఏలో భారత్, న్యూజిలాండ్ ఇప్పటికే సెమీస్ బెర్తును ఖాయం చేసుకోగా, ఆతిథ్య పాకిస్థాన్, బంగ్లాదేశ్ టోర్నీ నుంచి వైదొలిగిన విషయం విదితమే.

ఆ నిధులన్నీ ఏం చేశారు?

దక్షిణాఫ్రికా, ఆసీస్ మ్యాచ్ వర్షార్పణమైన నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నిర్వహణ తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చాంపియన్స్ ట్రోఫీ నిర్వహణ కోసం ఐసీసీ నుంచి భారీగా నిధుల్ని దక్కించుకున్న పీసీబీ.. వాటిని సరైన రీతిలో వినియోగించలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారత మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ తన 'ఎక్స్' ఖాతాలోనూ దీనిపై గళమెత్తాడు. రావల్పిండి స్టేడియాన్ని పూర్తిగా కప్పిఉంచే కవర్లు కూడా లేకపోవడం సిగ్గుచేటని, ఐసీసీ నిధుల్ని ఆతిథ్య దేశం తెలివిగా వినియోగించుకోలేదని అతడు ట్వీట్ చేశాడు.

భళా అమ్మాయిలు

- నెదర్లాండ్స్‌కు షాకిచ్చిన భారత హాకీ జట్టు

భువనేశ్వర్: వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న భారత మహిళల హాకీ జట్టు.. నెదర్లాండ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సంచలన విజయం సాధించింది. ఒలింపిక్ చాంపియన్స్, ప్రపంచ నంబర్‌వన్ జట్టు అయిన నెదర్లాండ్స్‌ను షూటౌట్‌లో ఓడించి సోమవారం ఇదే జట్టుపై కలిగిన పరాభవానికి బదులు తీర్చుకుంది. మ్యాచ్‌లో నిర్దేశిత సమయానికి స్కోర్లు 2-2తో సమమవగా పోరు షూటౌట్‌కు దారితీసింది. షూటౌట్‌లో భారత్ 2-1తో డచ్ జట్టుకు షాకిచ్చింది. డచ్ తరపున సాండర్స్ (17ని.), ఫేవాన్ డర్ (28ని.) రెండు గోల్స్ చేసి తొలి అర్ధభాగం ముగిసే సరికి 2-0 ఆధిక్యంలో నిలిచారు. కానీ థర్డ్ క్వార్టర్‌లో దీపికా (35ని), బాలాజీ కౌర్ (43ని.) తలా ఓ గోల్ చేయడంతో స్కోర్లు సమమయ్యాయి. షూటౌట్‌లో దీపికా, ముంతాజ్ బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపించగా.. నెదర్లాండ్స్ నుంచి మరిన్ వీన్ మాత్రమే గోల్ చేయడంలో సఫలమైంది. పురుషుల విభాగంలో భారత్.. 2-1తో ఇంగ్లండ్‌ను చిత్తుచేసింది.

శ్రీనిధి ఎఫ్‌సీ జోరు

గోవా: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్‌లో శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ ఎఫ్‌సీ గెలుపు జోరు దిగ్విజయంగా కొనసాగుతున్నది. మంగళవారం పీజేఎన్ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 3-2తో డెంపో ఎస్‌సీపై అద్భుత విజయం సాధించింది. శ్రీనిధి తరపున డెవిడ్ కాస్టాండ మునోజ్(53ని, 59ని) డబుల్ గోల్స్‌తో అదరగొట్టగా, బ్రాండన్(69ని) మరో గోల్‌చేశాడు. మార్కస్ జోసెఫ్(8ని), జువాన్ మెరా(45ని)..డెంపోకు గోల్స్ అందించారు. శ్రీనిధి ఎఫ్‌సీ ప్రస్తుతం 22 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో కొనసాగుతున్నది.

ఢిల్లీ టాప్ షో

గుజరాత్‌పై ఘన విజయం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో ఢిల్లీ క్యాపిటల్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. లీగ్‌లో పడుతూ లేస్తూ సాగుతున్న నిరుటి రన్నరప్ ఢిల్లీ..మంగళవారం నాటి మ్యాచ్‌లో గుజరాత్ జెయింట్స్‌పై 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి టాప్‌లోకి దూసుకెళ్లింది. తొలుత గుజరాత్ 20 ఓవర్లలో 127/9 స్కోరుకే పరిమితమైంది. భారతి(40 నాటౌట్)మినహా అందరూ ఘోరంగా విఫలమయ్యారు. ఢిల్లీ బౌలింగ్ ధాటికి గుజరాత్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. హర్లిన్ డియోల్(5), లిచ్‌ఫీల్డ్(0), కెప్టెన్ గార్డ్‌నర్(3), కాశ్వి గౌతమ్(0), బేత్‌మూనీ(10) సింగిల్ డిజిట్ స్కోర్లకు పరిమితమయ్యారు. మారిజానె కాప్(2/17), శిఖాపాండే(2/18), సదర్లాండ్(2/20) రెండేసి వికెట్లు తీశారు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ..15.1 ఓవర్లలో 131/4 స్కోరు చేసింది. జెస్ జొనాసెన్(32 బంతుల్లో 61 నాటౌట్, 9ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ అర్ధసెంచరీతో జట్టును గెలిపించింది. షెఫాలీవర్మ(44) ఆకట్టుకుంది. కాశ్వి గౌతమ్(2/26) రెండు వికెట్లు తీసింది.

పాక్ జట్టును ధోనీ కూడా ఏం చేయలేడు

- రిజ్వాన్ సేనపై సనా మిర్ కామెంట్స్

కరాచీ: లీగ్ దశలో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయి చాంపియన్స్ ట్రోఫీ నుంచి నిష్క్రమించిన ఆతిథ్య పాకిస్థాన్ క్రికెట్ జట్టుపై మాజీ క్రికెటర్లు విమర్శల దాడిని పెంచారు. ప్రస్తుతమున్న పాకిస్థాన్ క్రికెట్ జట్టును భారత దిగ్గజ సారథి మహేంద్ర సింగ్ ధోనీ కూడా మార్చలేడని పాక్ మహిళా జట్టు మాజీ సారథి సనా మిర్ అభిప్రాయపడింది. ఓ టీవీ షోలో ఆమె మాట్లాడుతూ 'చాంపియన్స్ ట్రోఫీ కోసం ఎంపిక చేసిన 15 మంది సభ్యుల పాక్ టీమ్‌ను ధోనీ గానీ యూనిస్ ఖాన్ (మాజీ కెప్టెన్) గానీ మార్చలేరు. ఈ జట్టుతో ఎవరూ ఏమీ చేయలేరు. భారత్‌తో మ్యాచ్ జరుగుతున్నప్పుడు నాకు ఓ ఫ్రెండ్ ఫోన్ చేసి టీమ్‌ఇండియా స్కోరు 100/2గా ఉంది. మనం ఓడిపోయినట్టే అని చెప్పింది. అప్పుడు నేను.. ఈ జట్టును ప్రకటించినప్పుడే అంతా అయిపోయిందని చెప్పా' అని వ్యాఖ్యానించింది.

వాళ్లిస్తానంటే నేనొద్దంటానా!

- కేకేఆర్ కెప్టెన్సీపై వెంకటేశ్ ఆసక్తి

కోల్‌కతా: ఐపీఎల్ గత సీజన్ విజేత కోల్‌కతా నైట్ రైడర్స్ యాజమాన్యం తనకు సారథ్య పగ్గాలు అప్పజెప్పితే అందుకు తాను సిద్ధంగా ఉన్నానని స్టార్ ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్ అన్నాడు. మంగళవారం అతడు ఈఎస్‌పీఎన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'అవును.. నేను సిద్ధమే. కెప్టెన్సీ గురించి నేనెప్పుడూ ఒకే మాట చెబుతుంటా. నాయకత్వం అనేది ఒక ట్యాగ్ మాత్రమే అని నేను నమ్ముతాను. నాయకుడిగా ఉంటూ చాలా పెద్ద పాత్ర పోషించాలి. నా వరకు వస్తే నేను దానికి నో అని చెప్పడానికేమీ లేదు. జట్టులో సారథిగా ఉన్నా లేకున్నా నా మాటకు విలువిస్తూ నా అభిప్రాయాలను గౌరవించే విధంగా ఉంటే.. కెప్టెన్సీ ఉన్నా లేకపోయినా నాకు అంగీకారమే' అని అన్నాడు.

పంజాబ్ టోర్నీకి తెలంగాణ పోలీసు జట్లు

కబడ్డీ, ఖోఖోల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (నమస్తే తెలంగాణ) : పంజాబ్‌లో జరుగుతున్న జాతీయ పోలీసు స్పోర్ట్స్ మీట్ కోసం తెలంగాణ నుంచి కబడ్డీ, ఖోఖో బృందాలు బయల్దేరి వెళ్లాయి. రాష్ట్రం నుంచి మొత్తం 74 మంది పోలీసు క్రీడాకారులు అక్కడ జరిగే క్రీడల్లో పోటీపడుతున్నారు. పురుషులు, మహిళల విభాగాల్లో ఇప్పటికే ప్రతిభ కనబర్చిన రాష్ట్ర జట్లకు డీజీపీ జితేందర్ అభినందనలు తెలిపారు. పంజాబ్‌లోను పతకాలు కొల్లగొట్టాలని క్రీడాకారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఐజీ రమేశ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విదర్భ X కేరళ

నేటి నుంచి రంజీ ఫైనల్స్

నాగ్‌పూర్: దేశవాళీలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన రంజీ ట్రోఫీ సీజన్ 2024-25 చివరి అంకానికి చేరింది. బుధవారం నుంచి ఈ సీజన్‌లో ఫైనల్స్ మ్యాచ్ జరుగనుంది. నాగ్‌పూర్ వేదికగా జరుగబోయే 90వ ఎడిషన్ టైటిల్ పోరులో గత సీజన్ రన్నరప్ విదర్భ, తొలిసారి ఫైనల్ చేరిన కేరళతో అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఈ సీజన్ ఆసాంతం ఆడిన 9 మ్యాచ్‌లలో ఏకంగా ఎనిమిదింటిలో గెలిచిన విదర్భ.. ఒక మ్యాచ్‌ను డ్రా చేసుకుని జోరు మీదుంది. క్వార్టర్స్‌లో తమిళనాడును.. సెమీస్‌లో డిఫెండింగ్ చాంపియన్, గత సీజన్‌లో తమకు టైటిల్ దక్కకుండా చేసిన ముంబైని మట్టికరిపించిన ఆ జట్టు రెట్టించిన ఉత్సాహంతో ఫైనల్ బరిలోకి దిగుతోంది. విదర్భ యువ బ్యాటర్ యశ్ రాథోడ్ ఈ సీజన్‌లో ఏకంగా 58.13 సగటుతో 933 రన్స్‌తో జోరుమీదుండగా కెప్టెన్ అక్షయ్ వాడ్కర్ (674), సీనియర్ బ్యాటర్ కరుణ్ నాయర్ (642), డానిష్ మలెవర్ (557), ధ్రువ్ షోరే (446) మంచి ఫామ్‌లో ఉన్నారు. బౌలర్లలో 22 ఏండ్ల కుర్రాడు హరీష్ దూబే.. 9 మ్యాచ్‌లలో 66 వికెట్లు తీసి టాప్ వికెట్ టేకర్‌గా నిలిచాడు. ఇందులో ఏకంగా ఏడు సార్లు ఐదు వికెట్ల ఘనత ఉండటం విశేషం. ఇక రంజీ చరిత్రలో తొలిసారి ఫైనల్ చేరిన కేరళ సైతం టోర్నీలో స్ఫూర్తిదాయక విజయాలతో తుది మెట్టు దాకా వచ్చింది. క్వార్టర్స్‌లో జమ్ము కశ్మీర్‌పై ఒక్క పరుగు, సెమీస్‌లో గుజరాత్‌పై రెండు పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో ఫైనల్ చేరిన సచిన్ బేబీ సారథ్యంలోని కేరళ.. తమ సీజన్‌ను విజయంతో ముగించాలని భావిస్తోంది. సల్మాన్ నిజర్ (607 పరుగులు), మహ్మద్ అజారుద్దీన్ (601) కేరళ బ్యాటింగ్ ఆర్డర్‌కు కీలకం. బౌలర్లలో జలజ్ సక్సేనా (38 వికెట్లు), ఆదిత్య సర్వతె (30) ఆ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.